మీ గళం.. మా కలం..!

# నమస్తే హైదరాబాద్

www.namasthehyderabad.in

తెలుగు దిన పత్రిక

విలేకరులు కావలెను
నిత్యనూతనంగా వెలువడుతూ విశేష ప్రజాధరణ పొందుతున్న నమస్తే హైదరాబాద్ తెలుగు దినపత్రికకు తెలంగాణ రాష్ట్రం లోని అన్ని జిల్లా, మండల కేంద్రాలలో విలేకరులు కావలెను
సీనియర్‌లకు ప్రాధాన్యం కొత్తవారికి అవకాశం
Ph: 9912580066

రంగా రెడ్డి సంపుటి : 13 సంచిక :122 ఎడిటర్: గొడిశాల సోమయ్య శనివారం 28-09-2024 పేజీలు :4 వెల : 2రూ

## విద్యార్థుల కోసం కొత్త పథకం..



**నమస్తే హైదరాబాద్ :** సంచలన నిర్ణయాలతో దూసుకెళ్లిపోతున్న సీఎం రేవంత్ రెడ్డి మరో ఇంట్రెస్టింగ్ ప్రకటన చేశారు. ఈసారి విద్యార్థులు ఎగిరి గంతేసే వార్త వినిపించారు. రాష్ట్రంలో ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థుల కోసం ప్రత్యేక కార్యక్రమాన్ని ప్రకటించారు సీఎం రేవంత్ రెడ్డి. తెలంగాణ వ్యాప్తంగా ఉన్న పర్యాటక ప్రాంతాలను, చారిత్రక కట్టడాలను విద్యార్థులు ఉచితంగా సందర్శించేందుకు అవకాశం కల్పిస్తున్నట్లు సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు. ఇందు కోసం "తెలంగాణ దర్శిని" అనే కొత్త కార్యక్రమాన్ని తీసుకొస్తున్నట్టు వెల్లడించారు. రాష్ట్రంలోని చారిత్రక కట్టడాలు, పర్యాటక ప్రాంతాల గురించి విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు ఈ ప్రత్యేక కార్యక్రమం ఉపయోగపడుతుందని సీఎం రేవంత్ రెడ్డి అభిప్రాయం వ్యక్తం చేశారు.ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకుని.. సచివాలయంలో తెలంగాణ పర్యాటక రంగ అభివృద్ధిపై తెలంగాణ ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఈ క్రమంలోనే.. రాష్ట్రంలోని పర్యాటక ప్రాంతాల పునరుద్ధన గురించి సమీక్షలో చర్చించారు. ముఖ్యంగా హైదరాబాద్ నగరంలోని పలు పురాతన మెట్ల బావుల పునరుద్ధరణకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. పురాతన కట్టడాలు కాపాడడమే లక్ష్యంగా సీఐఐతో రాష్ట్ర పర్యాటక శాఖ ఒప్పందం కూడా కుదుర్చుకుంది.ఈ క్రమంలో.. పురాతన బావులను దత్తత తీసుకునేందుకు పలువురు పారిశ్రామికవేత్తలు, ప్రభుత్వ రంగ సంస్థలు ముందుకొచ్చాయి. ఇకపై పురాతన బావులను ప్రక్షాళన చేసి పర్యాటక కేంద్రాలుగా తీర్చిదిద్దేందుకు చర్యలు చేపట్టనున్నారు. ఈ మేరకు సీఎం రేవంత్ రెడ్డికి వారికి ఒప్పంద పత్రాలు అందజేశారు.ఉస్మానియా యూనివర్సిటీలోని మహాలఖా మెట్ల బావి పునరుద్దరణకు ఇన్ఫోసిస్ సంస్థ ఒప్పందం చేసుకుంది. మంచిరేవుల మెట్ల బావిని సాయి లైఫ్ సంస్థ దత్తత తీసుకుంది. భారత్ బయోటెక్ సంస్థ సాలార్ జంగ్, అమ్మపల్లి బావులను పునరుద్ధరించనుంది. అడిక్‌మెట్ మెట్ల బావిని దొడ్ల డైరీ, ఫలక్‌నుమా మెట్ల బావిని టీజీఎస్ ఆర్టీసీ, రెసిడెన్సీ మెట్ల బావిని కోఠి ఉమెన్స్ కాలేజీ పునరుద్ధరించనుంది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, టూరిజం ప్రిన్సిపల్ సెక్రటరీ వాణీప్రసాద్, సీఐఐ తెలంగాణ ఛైర్మన్ సాయి ప్రసాద్, ముఖ్యమంత్రి ప్రత్యేక కార్యదర్శి అజిత్ రెడ్డి, ముఖ్యమంత్రి ఓఎస్డీ వేముల శ్రీనివాసులు పాల్గొన్నారు.

## నేడు హైదరాబాద్‌కు రాష్ట్రపతి ముర్ము



**నమస్తే హైదరాబాద్ :** హైదరాబాద్, సెప్టెంబర్ 27 రాష్ట్రపతి ద్రౌపది ముర్ము శనివారం రాష్ట్రానికి రానున్నారు. ఉదయం నల్సార్ యూనివర్సిటీ ఆఫ్ లా స్నాతకోత్సవానికి హాజరవుతారు. మధ్యాహ్నం రాష్ట్రపతి నిలయంలో ఎనిమిది రోజులపాటు నిర్వహించే ఈశాన్య రాష్ట్రాల భారతీయ కళా మహోత్సవంను ప్రారంభిస్తారు.రాష్ట్రపతి పర్యటన సందర్భంగా మినిస్టర్ ఇన్ వెయిటింగ్‌గా మంత్రి సీతకను రాష్ట్ర ప్రభుత్వం నామినేట్ చేసింది. రాష్ట్రపతిని స్వాగతించడం మొదలు సాగనంపడం వరకు ఆమె వెంట సీతక్క ఉండనున్నారు.

## ప్రజా పోరాట యోధుడు బాపూజీ : కేటీఆర్



**నమస్తే హైదరాబాద్ :** హైదరాబాద్, సెప్టెంబర్ 27 ప్రజాపోరాటయోధుడు కొండా లక్ష్మణ్ బాపూజీ అని కేటీఆర్ పేర్కొన్నారు. 1969లో ఉవ్వెత్తున ఎగిసిన తెలంగాణ ఉద్యమంలో తన మంత్రి పదవికి రాజీనామా చేసి ఎందరో తెలంగాణ ఉద్యమకారులకు స్ఫూర్తిగా నిలిచిన మహానేత కొండా లక్ష్మణ్ బాపూజీ

2లో

## డిప్యూటీ సీఎం ఇంట్లో చోరీ..



**నమస్తే హైదరాబాద్ : :** తెలంగాణలో సంచలన ఘటన చోటుచేసుకుంది. ఏకంగా రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సొంత ఇంట్లో దొంగలు పడటం ఇప్పుడు సర్వత్రా కలకలంగా మారింది. ప్రస్తుతం డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క.. విదేశీ పర్యటనలో ఉన్న సమయంలో ఆయన ఇంట్లో దొంగతనం జరగటం సంచలనంగా మారింది. హైదరాబాద్ బంజారాహిల్స్ రోడ్డు నెంబర్ 14లో ఉన్న భట్టి విక్రమార్క నివాసంలో.. దొంగలు పడ్డారు. ఇంటి తాళం పగులగొట్టి.. లోపల ఉన్న బంగారు, వెండి ఆభరణాలతో పాటు నగదు కూడా ఎత్తుకెళ్లారు. అయితే.. ఇంట్లో నగదు, బంగారు, వెండి ఆభరణాలు దొంగిలించిన విషయాన్ని గమనించిన కుటుంబ సభ్యులు.. వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. దీంతో వెంటనే రంగంలోకి దిగిన పోలీసులు.. భట్టి నివాసానికి చేరుకుని అక్కడ ఉన్న సీసీ టీవీ ఫుటేజీలను పరిశీలించారు. సీసీ టీవీ ఫుటేజీల్లో చోరీకి సంబంధించిన వీడియోలు రికార్డవగా.. ఆ దృశ్యాల్లో ఉన్న దుండగులు.. బిహార్‌కు చెందినవారిగా పోలీసులు గుర్తించారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. విదేశాల్లో ఉన్న భట్టి విక్రమార్కకు ఈ దొంగతనం విషయం తెలియటంతో.. ఆయన పోలీస్ ఉన్నతాధికారులకు ఆదేశాలు జారీ చేశారు. దీంతో.. ఆ దొంగలను పట్టుకునేందుకు పోలీసులు ముమ్మర గాలింపు చేపట్టారు.

2లో

## హైదరాబాద్‌లో హెచ్‌సీఎల్ కొత్త క్యాంపస్.. అదనంగా 5 వేల మందికి ఉద్యోగాలు..!



**నమస్తే హైదరాబాద్ :** హైదరాబాద్‌లోని హైటెక్ సిటీలో హెచ్‌సీఎల్ త్వరలో కొత్త క్యాంపస్ ప్రారంభిస్తోంది. ఇందులో అదనంగా 5 వేల మంది ఇంజనీర్లకు ఉద్యోగాలను కల్పించనుంది. సచివాలయంలో హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ ఛైర్ పర్సన్ రోష్ని నాడార్ మల్హోత్రా సీఎం రేవంత్ రెడ్డిని కలిశారు. కొత్త క్యాంపస్ ప్రారంభోత్సవానికి రావాలని రేవంత్ రెడ్డిని ఆహ్వానించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యంగా ఎంచుకున్న విద్య, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలపై ప్రధానంగా చర్చించారు. విద్యార్థులకు మెరుగైన శిక్షణతో పాటు, విద్యా వనరులను విస్తరించేందుకు యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీలో హెచ్‌సీఎల్ భాగస్వామ్యం ఉండాలని సీఎం రేవంత్ రెడ్డి తన ఆకాంక్షను వ్యక్తం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా వేలాది మంది యువకులకు ప్రయోజనం చేకూర్చే నైపుణ్యాభివృద్ధికి హెచ్‌సీఎల్‌తో కలిసి పనిచేయడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు.రాష్ట్రంలో ఇప్పటికే ఉపాధి అవకాశాల కల్పనకు హెచ్‌సీఎల్ చేస్తున్న కృషిని ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి అభినందించారు. హెచ్‌సీఎల్‌కు రాష్ట్ర ప్రభుత్వం తగినంత సహకారం అందిస్తుందన్నారు. హెచ్‌సీఎల్ వ్యూహాత్మక భాగస్వామ్యం యువతకు ఉద్యోగాలను కల్పించటంతో పాటు రాష్ట్ర ఆర్థిక వృద్ధికి దోహదపడుతుందని రేవంత్ రెడ్డి అభిప్రాయపడ్డారు.

## తెలంగాణకు రిలయన్స్ ఫౌండేషన్ భూరి విరాళం..



**నమస్తే హైదరాబాద్ :** ఈ నెల మొదటి వారంలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లో వరదలు బీభత్సం సృష్టించిన విషయం తెలిసిందే. భారీ వర్షాలు, వరదలకు ప్రాణనష్టంతో పాటుగా భారీగా ఆస్తి, పంట నష్టం కూడా వాటిల్లింది. వరదల కారణంగా ఎందరో నిరాశ్రయులయ్యారు. సర్వస్వం కోల్పోయి కట్టుబట్టలతోనే మిగిలారు. ఇలాంటి వారికి పలువురు దాతలు అండగా నిలబడి.. తమకు తోచినంత సహాయం చేస్తున్నారు. వరదల్లో నష్టపోయిన ప్రజలకు రంగాలకు అతీతంగా పలువురు ప్రముఖులు, రాజకీయ నేతలు, వ్యాపారులు,

2లో

## ఆ భవనాన్ని ఎలా కూలుస్తారు..

### హైడ్రా కమిషనర్‌కు హైకోర్టు కీలక ఆదేశాలు



**నమస్తే హైదరాబాద్ :** హైదరాబాద్‌లో చెరువులు, కుంటలు, ప్రభుత్వ స్థలాల ఆక్రమణలే లక్ష్యంగా హైడ్రా బుల్డోజర్లు దూసుకెళ్తున్నాయి. నగరవ్యాప్తంగా ఉన్న చెరువులు, కుంటల్లో ఎఫ్టీఎల్, బఫర్ జోన్‌లోని కట్టడాలతో పాటు, ప్రభుత్వ స్థలాలను ఆక్రమించేది సెలెబ్రిటీలు, రాజకీయ నాయకులు, సామాన్యులు ఇలా ఎవరైనా సరే.. నిర్ధాక్షిణ్యంగా కూల్చివేయటమే అన్నట్టుగా బుల్డోజర్లు పంజా విసురుతున్నాయి. ఈ క్రమంలో.. హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్‌కు హైకోర్టు కీలక ఆదేశాలు చేసింది. వచ్చే సోమవారం (సెప్టెంబర్ 30వ తేదీన) ఉదయం 10.30 గంటలకు కోర్టు ఎదుట హాజరవ్వాలంటూ రంగనాథ్‌ను ఆదేశించింది.ఇటీవల అమీన్‌పూర్‌లో ఓ భవనాన్ని హైడ్రా కూల్చివేయగా.. కోర్టులో పెండింగ్‌లో ఉన్న భవనాన్ని ఎలా కూలుస్తారంటూ హైకోర్టు ప్రశ్నించారు. ఈ విషయం మీద.. వ్యక్తిగతంగానైనా లేదా వర్చువల్‌గానైనా కోర్టుకు సమాధానం చెప్పాలని ఉన్నత న్యాయస్థానం హైడ్రా కమిషనర్ రంగనాథ్‌ని ఆదేశించింది. హైదరాబాద్‌లో ఓవైపు హైడ్రా కూల్చివేతలు జోరుగా సాగుతుండగా.. మరోవైపు మూసీ పరివాహక ప్రాంతాల్లోని నివాసాలకు మార్కింగ్ జరుగుతున్న నేపథ్యంలో.. హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు హైకోర్టు ఆదేశాలు జారీ చేయటం ఇప్పుడు సర్వత్రా ఉత్కంఠ నెలకొంది.ఇటీవల.. కూకట్ పల్లి నల్ల చెరువు ఆక్రమణలను, అమీన్ పూర్‌లో నిర్మించిన పలు విల్లాలను హైడ్రా కూల్చివేసింది. అయితే.. ఈ కూల్చివేతలు సర్వత్రా వివాదాస్పదంగా మారాయి.

2లో

## హైదరాబాద్‌లో అవన్నీ బ్యాన్.



**నమస్తే హైదరాబాద్ :** "హైదరాబాద్‌లో ఓవైపు చెరువులు, కుంటలు, ప్రభుత్వ స్థలాల్లో నిర్మించిన కట్టడాలను హైడ్రా నేలమట్టం చేస్తుంటే.. మరోవైపు మతపరమైన కార్యక్రమాల్లో డీజేల వినియోగంపై నిషేధం విధించనున్నారంటూ చర్చ నడుస్తుంటే.. ఇప్పుడు కొత్తగా జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి కాటా సంచలన ఆదేశాలు జారీ చేశారు. హైదరాబాద్ నగరంలో పోస్టర్లు, బ్యానర్లు, కటౌట్లు బ్యాన్ చేస్తూ.. ఆమ్రపాలి కీలక ఆదేశాలు జారీ చేశారు. వాల్ పోస్టర్లతో పాటు వాల్ పెయింటింగ్స్‌పై కూడా సీరియస్‌గా వ్యవహరించాలని ఆమ్రపాలి సర్క్యులర్ జారీ చేశారు.

2లో

# డిప్యూటీ సీఎం ఇంట్లో చోరీ..

ఈ క్రమంలోనే.. చోరీకి పాల్పడిన దొంగలు పశ్చిమ బెంగాల్‌లో పోలీసులకు దొరికిపోయారు. ఖరగ్‌పూర్ రైల్వేస్టేషన్‌లో ఏడో నంబర్ ప్లాట్‌ఫాంపై జీఆర్పీ పోలీసుల తనిఖీలు నిర్వహిస్తున్న సమయంలో.. ఇద్దరు వ్యక్తులు అనుమానాస్పదంగా కనిపించారు. వారిని వెంటనే అదుపులోకి తీసుకొని విచారించగా.. తాము దొంగలమని పోలీసుల ఎదుట ఒప్పుకున్నారు. నిందితులు బిహార్‌కు చెందిన రోషన్‌కుమార్ మండల్, ఉదయ్‌కుమార్ ఠాకూర్‌గా పోలీసులు గుర్తించారు. వారిని అదుపులోకి తీసుకొని విచారించగా.. తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క నివాసంలో దొంగతనం చేసి పారిపోతున్నట్టు తెలిపినట్టు.. ఖరగ్‌పూర్ జీఆర్పీ ఎస్పీ దేబశ్రీ సన్యాల్ వెల్లడించారు. నిందితుల వద్ద 2.2 లక్షల రూపాయల నగదుతో పాటు 100 గ్రాముల బంగారు నాణెం, కొంత విదేశీ కరెన్సీ నోట్లు, పెద్ద మొత్తంలో బంగారు, వెండి ఆభరణాలతో పాటు నగదు కూడా స్వాధీనం చేసుకున్నామని బెంగాల్ పోలీసులు తెలిపారు. ఈ విషయంపై తెలంగాణ పోలీసులకు సమాచారం ఇచ్చినట్లు వెల్లడించారు. విచారణ అనంతరం తెలంగాణలోని బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్‌ను సంప్రదించగా ఆ పోలీస్ స్టేషన్‌లో ఈ చోరీ ఘటనకు సంబంధించి నిందితుడు రోషన్ కుమార్ మండల్ పేరుతో కేసు నమోదైనట్లు గుర్తించారు. నిందితులను ఖరగ్‌పూర్ కోర్టులో హాజరుపరచనున్నారు.

# ఆ భవనాన్ని ఎలా కూలుస్తారు..

## హైడ్రా కమిషనర్‌కు హైకోర్టు కీలక ఆదేశాలు

కూకట్ పల్లి నల్లచెరువు పరిధిలోని నిర్మాణాలు సుమారు అన్నీ.. స్థలాలు లీజుకు తీసుకుని అందులో చిన్న చిన్న వ్యాపారాలు నడిపిస్తున్నట్టు తెలుస్తోంది. అయితే.. అమీన్ పూర్ కూల్చివేతల్లో మాత్రం దాదాపు నివాస గృహాలే ఉండటం గమనార్హం. అందులోనూ.. చాలా మంది బ్యాంకుల్లో లోన్లు తీసుకుని మరీ.. ఇండ్లు నిర్మించుకున్నామంటూ బోరుమన్నారు. ఒకరేమో.. కూల్చేందుకు వారం రోజుల ముందే గృహప్రవేశం చేశామంటూ కన్నీళ్లు పెట్టుకోగా.. మరొకరు మూడు రోజుల కిందే రిజిస్ట్రేషన్ చేపించుకున్నామని చెప్తూ గోడు వెళ్లబోసుకున్నారు. బ్యాంకుల్లో లక్షలు లక్షలు లోన్లు తీసుకొచ్చుకుని.. కలల సౌధం నిర్మించుకుంటే.. కళ్ల ముందే నేలమట్టం చేశారని గుండెలు బాదుకున్నారు. తాము బిల్డర్ల దగ్గర కొనుక్కుని ఇండ్లు కట్టుకున్నామని.. తాము ఇండ్లు కట్టుకునేందుకు అన్ని రకాల అనుమతులు ఇచ్చారని చెప్పారు. ఇప్పుడేమో ఇది ఎఫ్టీఎల్, బఫర్ జోన్ అంటూ నిర్దాక్షిణ్యంగా కూల్చివేయటం దారుణమని.. బాధపడ్డారు.

## తెలంగాణకు రిలయన్స్ ఫౌండేషన్ భూరి విరాళం..

ప్రభుత్వ ఉద్యోగులు, విద్యాసంస్థలు విరాళాలు అందిస్తున్నాయి. వరద బాధితులకు అండగా సీఎం సహాయనిధికి విరాళాల రూపంలో అందజేస్తున్నారు. తెలంగాణలో వరద బాధితుల కోసం విరాళాలు వెల్లువెత్తుతున్నాయి. తాజాగా, బాధితుల సహాయార్థం ముఖ్యమంత్రి సహాయనిధికి రిలయన్స్ ఫౌండేషన్ భూరి విరాళం అందజేసింది. సీఎం సహాయనిధికి రూ.20 కోట్లను ప్రకటించింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఆయన జూబ్లీహిల్స్ నివాసంలో నీతా అంబానీ తరపున చెక్‌ను రిలయన్స్ ఫౌండేషన్ ప్రతినిధులు శుక్రవారం అందించారు. రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అండ్ బోర్డు సభ్యుడు పీఎంఎస్ ప్రసాద్, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు సంబంధించిన మెంటార్-రిలయన్స్ గ్రూప్ పీవీఎల్ మాధవరావులు కలిసి సీఎం రేవంత్ రెడ్డి నివాసానికి వెళ్లారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సమక్షంలో సంస్థ తరపున విరాళంగా రూ.20 కోట్లు చెక్కును సీఎం రేవంత్‌కు అందజేశారు. దీంతో వారికి సీఎం రేవంత్ రెడ్డి కృతజ్ఞతలు చెప్పారు. ఇప్పటివరకు ఇంత మొత్తంలో ఎవరూ విరాళాన్ని ఇవ్వలేదు. టాలీవుడ్ హీరోలు చిరంజీవి, ప్రభాస్, జూనియర్ ఎన్టీఆర్, మహేశ్ బాబు, రాంచరణ్ సహా పలువురు నిర్మాతలు, దర్శకులతో పాటు పలు ప్రయివేట్ సంస్థలు విరాళాలను అందజేశాయి. ప్రభుత్వ ఉద్యోగుల సైతం తమ ఒక్క రోజు వేతనాన్ని వరద బాధితుల కోసం వదులుకున్నాయి. స్టేట్ బ్యాంకు ఉద్యోగుల సంఘం కూడా రూ.5 కోట్ల విరాళంగా అందజేసింది. విశాఖ టీడీపీ ఎంపీ, హిందూపురం ఎమ్మెల్యే బాలకృష్ణ అల్లుడు శ్రీ భరత్.. తమ గీతం విద్యా సంస్థల తరపున రూ.కోటి సీఎం రేవంత్ రెడ్డికి అందజేశారు.

# హైదరాబాద్‌లో అవన్నీ బ్యాన్.

ఈ క్రమంలోనే.. సినిమా థియేటర్ వాళ్లు కూడా ఎక్కడా గోడలకు పోస్టర్లు అతికించకుండా చూడాలని డిప్యూటీ కమిషనర్లకు ఆమ్రపాలి ఆదేశాలు జారీ చేశారు. గోడలపై పోస్టర్లు అంటిస్తే జరిమానా విధించాలని ఆదేశించారు. ఈ ఉత్తర్వులను సీరియస్‌గా అమలు చేయాలని అధికారులకు ఆమ్రపాలి సూచించారు. అయితే.. నిబంధనలు అతిక్రమిస్తే మాత్రం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు కూడా. అయితే.. నగరాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్టుగా ఉత్తర్వుల్లో కమిషనర్ ఆమ్రపాలి పేర్కొన్నారు.

ఇదిలా ఉంటే.. హైదరాబాద్ నగరాన్ని క్లీన్ సిటీగా మార్చేందుకు.. కీలక నిర్ణయాలు తీసుకుంటోంది ప్రభుత్వం. ఇప్పటికే.. నగరంలోని చెరువులు, కుంటలు, ప్రభుత్వ స్థలాలను కాపాడేందుకు.. ప్రభుత్వం హైడ్రా బుల్డోజర్లను ప్రయోగిస్తోంది. ఆయా చెరువులు, కుంటలను ఆక్రమించిన నిర్మాణాలను నిర్దాక్షిణ్యంగా కూల్చేస్తున్నారు. ఈ హైడ్రా కూల్చివేతలు కేవలం హైదరాబాద్‌లోనే కాకుండా రాష్ట్రవ్యాప్తంగా ఓ సంచలనంగా మారింది. ఈ హైడ్రా కూల్చివేతల్లో సామాన్యులకు సంబంధించిన నిర్మాణాలు కూడా నేలమట్టం అవుతుండటం ఇప్పుడు సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. మరోవైపు.. మతపరమైన కార్యక్రమాల్లో డీజేల వాడకం.. మితిమీరిన సౌండ్స్, నృత్యాల విషయంలోనూ ప్రభుత్వం కీలక నిర్ణయం దిశగా అడుగులు వేస్తోంది. ఇప్పటికే.. హైదరాబాద్ సీపీ సీవీ ఆనంద్ అధ్యక్షతన రాజకీయ నేతలు, మతసంఘాల నాయకులతో సమావేశం నిర్వహించి.. డీజేల బ్యాన్ విషయంపై చర్చించారు. త్వరలోనే.. ప్రభుత్వానికి ఈ డీజేల బ్యాన్ అంశం మీద నివేదిక ఇస్తామని సీపీ సీవీ ఆనంద్ తెలిపారు. ఈ విషయం కూడా ఇప్పుడు హైదరాబాద్‌లో సర్వత్రా చర్చనీయాశంగా మారిన విషయం తెలిసిందే.

## ప్రజా పోరాట యోధుడు బాపూజీ : కేటీఆర్

అని కొనియాడారు. స్వాతంత్ర్య పోరాటం, మలి దశ తెలంగాణ ఉద్యమం దాకా ప్రజా ఉద్యమాల్లో వారి పాత్ర అనిర్వచనీయమన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం కేసీఆర్ సారథ్యంలో ఏర్పాటు చేసిన తెలంగాణ రాష్ట్ర సమితి పార్టీ కొండా లక్ష్మణ్ బాపూజీ నివాసంలోనే పురుడు పోసుకున్న విషయాన్ని ఆయన గుర్తు చేశారు. కేసీఆర్ ప్రభుత్వం ట్యాంక్ బండ్ వద్ద కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహం ఏర్పాటు చేసి, హార్టికల్చరల్ యూనివర్సిటీకి వారి పేరు పెట్టి ఘనంగా స్మరించుకున్నదని తెలిపారు.

# కాజీపేట రైల్వే డీజిల్ లోకో షెడ్ లో స్వచ్ఛతహి సేవ ఉత్సవాలు



కాజీపేట సెప్టెంబర్ 27ట నమస్తే హైదరాబాద్ దక్షిణ మధ్య రైల్వే నిర్వహిస్తున్న స్వచ్ఛతాహి సేవ ఉత్సవాలలో భాగంగా సెప్టెంబర్ 14 నుండి 30వ తేదీ వరకు నిర్వహించే ఈ కార్యక్రమంలో శుక్రవారం కాజీపేట డిజిల్ లోకో షెడ్ లో సికింద్రాబాద్ డివిజన్ శేఖర్ నాటక టీం సేవా కార్యక్రమంలో నాటికలను ప్రదర్శించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సీనియర్ డిఎంఈ ఎం.వి వెంకట్ కుమార్ హాజరై, పర్యావరణ పరిశుభ్రత చెట్ల యొక్క ఆవశ్యకతపై ప్రదర్శించిన నాటికకి శేఖర్ బృందాన్ని అభినందించారు. కాగా, ఎన్వి వెంకట్ కుమార్ డీజిల్ లోకో షెడ్ ఉద్యోగులతో డిజిల్ కాలనీ రోడ్డుకి ఇరువైపులా పేరుకుపోయి ఉన్న చెత్తను తొలగించి, కాలనీ మరియు రైల్వే షెడ్ ఆవరణలో మొత్తం 1,116 మొక్కలను నాటించారు. దీనిపై అవగాహన కల్పించిన ఎం.వి వెంకట్ కుమార్ ని నుక్కడ్ నాటిక టీం వారు శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో అధికారులు దక్షిణ మధ్య రైల్వే అధికారులు బి.ఎం.ఇ అనికేత్, ఏడిఎంఈఎం భాను ప్రకాష్, నాగరాజు, శేఖర్, ఎల్ ఎఫ్ రాజశేఖర్, ఈఎఫ్ రమేష్ కుమార్, సూపర్వైజర్లు మరియు సికింద్రాబాద్ డివిజన్ శేఖర్ బృందం సభ్యులు కే రమాదేవి, నల్లెపోగు తబిధ (పింకీ ),అన్వర్ హుస్సేన్, రవికిరణ్, మీనాక్షి, మేరీ కేథరిన్, ఆంజనేయులు మరియు సహ ఉద్యోగులు పాల్గొన్నారు.

# సమస్యల పరిష్కారానికి వినతిపత్రం అందజేత



కాజీపేట సెప్టెంబర్ 27 టనమస్తే హైదరాబాద్ భవన నిర్మాణ రంగాల కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం తెలంగాణ భవన నిర్మాణ రంగాల కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు హైదరాబాద్ నందు తెలంగాణ పిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ ను మర్యాదపూర్వకంగా కలిసి వినతి పత్రం అందజేశారు, ఈ సందర్భంగా సంఘం సభ్యులు మాట్లాడుతూ రాష్ట్రంలో భవన నిర్మాణ కార్మికులు 60 లక్షల మంది ఉన్నారని రాష్ట్రంలో నేటికీ కార్మిక చట్టం 96 అమలులోకి వచ్చి సుమారు 14 15 సంవత్సరాలు గడుస్తుందని, గతంలో మాజీ ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి 2009లో కార్మిక చట్టాన్ని అమలు చేశారని, గత ప్రభుత్వం కార్మికులకు అన్ని రకాల సంక్షేమ పథకాలు అందిస్తామని హామీ ఇచ్చి మాటలకే పరిమితం చేసి కార్మికులను మోసం చేసింది, కార్మికుల సమస్యల పరిష్కారానికి కాంగ్రెస్ ప్రభుత్వం అండగా నిలిచి కార్మిక మంత్రిత్వ శాఖను ప్రతిష్ట చేసి మంత్రి నియమించాలని, రాష్ట్రంలో నేటి వరకు 30 లక్షల మందికి మాత్రమే కార్మికులుగా గుర్తింపు ఇవ్వడం జరిగింది మిగిలిన అర్హులైన కార్మికులకు సత్వరమే గుర్తింపు కార్డును అందించాలని, లేబర్ కార్డు కలిగిన కార్మికుడికి 60 సంవత్సరాలు దాటితే ఎలాంటి లబ్ధి చేయకపోవడం లేదని, కార్డు కలిగిన ప్రతి కార్మికుడికి జీవితాంతం లబ్ధి పొందేల జీవో అమలు చేయాలని, మరణించిన కార్మికుడికి అంత్యక్రియల నిమిత్తం 50,000 ఆర్థిక సహాయం అందించడంతోపాటు ఈఎస్ఐ సదుపాయం, 60 సంవత్సరాలు పైబడిన కార్మికులకు పెన్షన్, జిల్లాల వారీగా భవన నిర్మాణ కార్మికుల భవనాల ఏర్పాటుకు 5000 గజాల స్థలాన్ని కేటాయించి కోటి రూపాయల నిధులు విడుదల చేయాలని, ప్రమాదవశాత్తు మరణించిన కార్మికుడికి పది లక్షలు, సాధారణ మరణం పొందితే 3లక్షలు, అంగవైకల్యం పొందితే 8 లక్షలు, కార్మికుల పిల్లల వివాహానికి, ప్రసూతికి ఒక లక్ష అందించాలని, కార్మికుల పిల్లల చదువులు మొత్తం కేజీ టు పీజీ ఉచిత విద్య అందించాలని పలు రకాల సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అందజేయడం జరిగింది అన్నారు, ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షులు ధర్పల్లి చంద్రం, మెదక్ వర్కింగ్ ప్రెసిడెంట్ చల్మెల రాములు, రాష్ట్ర ఉపాధ్యక్షులు బస్కె దశరథం, బండారి గంగాధర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గిన్నారం మహేందర్, రాష్ట్ర ప్రచార కార్యదర్శి నల్ల స్వామి తదితరులు పాల్గొన్నారు

# ఉపాధ్యాయులకు ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు కల్పించాలి



నమస్తే హైదరాబాద్ తుంగతుర్తి ప్రతినిధి సెప్టెంబర్ 27: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాల ఉపాధ్యాయులకు ఓటు హక్కు కల్పించాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (టీపీయూఎస్) జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పర్వతం సంధ్యారాణి, యామా రమేశ్ లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంతో పాటు మండల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో టీపీయూఎస్ మండల బాధ్యులు పిన్నపురెడ్డి కార్తీక్ రెడ్డి, గుర్రం పాపిరెడ్డిల ఆధ్వర్యంలో నిర్వహించిన టీపీయూఎస్ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. రానున్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఉన్నత పాఠశాల, కళాశాలలతో పాటు ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల ఉపాధ్యాయులకు కూడా ఓటు హక్కు కల్పించాలన్నారు. జీవో.నెం.25 లోని అసంబద్ధ మార్గదర్శకాలను సవరించి ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలని, పెండింగ్లో ఉన్న డీఏలను చెల్లించాలని, నూతన పీఆర్సీని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు అమరవాది బ్రహ్మాచారి, జూలకంటి వెంకట్ రెడ్డి, కవిత, చంద్రకళ, విగ్నేశ్వరి, కృష్ణవేణి, శేఖర్, రామనర్సమ్మ, రవికుమార్, మాధవి, హరీష్, భాస్కర్, సూర్య తదితరు పాల్గొన్నారు.

# శేరిలింగంపల్లి అభివృద్ధికి నిధులు మంజూరు చేయండి



## ఎమ్మెల్యే అరికపూడి గాంధీ భేటీ

నమస్తే హైదరాబాద్, శేరిలింగంపల్లి న్యూస్ : శేరిలింగంపల్లి జోనల్ కార్యాలయంలో జోనల్ కమిషనర్ ఉపేందర్ రెడ్డి ని శుక్రవారం పీఏసీ చైర్మన్,ఎమ్మెల్యే అరికపూడి గాంధీ మర్యాదపూర్వకంగా కలిశారు. శేరిలింగంపల్లి నియోజకవర్గంలో నెలకొన్న పలు సమస్యలు మరియు చేపట్టవలసిన పలు అభివృద్ధి పనులపై కార్పొరేటర్లు రాగం నాగేందర్ యాదవ్, ఉప్పలపాటి శ్రీకాంత్ లతో కలిసి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ శేరిలింగంపల్లి నియోజకవర్గంలో అభివృద్ధి పనులకు నిధులు కేటాయించాలని, పెండింగ్ లో ఉన్న పనులు త్వరితగతిన పూర్తయ్యేలా అధికారులకు ఆదేశాలు ఇవ్వాలనిఅన్నారు. అసంపూర్తిగా మిగిలిపోయిన పనులు త్వరితగతిన పూర్తయ్యేలా చూడాలని ఎమ్మెల్యే గాంధీ జోనల్ కమిషనర్ ను కోరారు. అదేవిధంగా మంజీర పైప్ లైన్ రోడ్డు నిర్మాణం పనులు వెంటనే చేపట్టాలని, శ్రీదేవి థియేటర్ నుండి అమిన్ పూర్ రోడ్డు విస్తరణ పనులు త్వరితగతిన చేపట్టాలని, పాపిరెడ్డి కాలనీ నుండి జోనల్ కార్యలయంకు కలిపే లింక్ రోడ్డు పనులు త్వరితగతిన చేపట్టి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని, గంగారాం హనుమాన్ దేవాలయం ప్రధాన రహదారి నుండి అపర్ణ వరకు లింక్ రోడ్డు పనులు త్వరితగతిన ప్రారంభంయ్యేలా చూడలాని అన్నారు. ప్రజఅవసరాల దృష్ట్యా లింక్ రోడ్ల పనులు త్వరితగతిన పూర్తి అయ్యేలా చూడాలని ,కూడలి ల సుందరి కరణ చేపట్టాలని, గుర్రపు డెక్కను వెంటనే తొలగించాలని, చెరువుల సుందరికరణ, పార్క్ లు అభివృద్ధి చేపట్టాలని, స్మశాన వాటికల ను అభివృద్ధి చేయాలని జోనల్ కమీషనర్ ను ఎమ్మెల్యే గాంధీ కోరారు. వర్షాల వలన దెబ్బతిన్న రోడ్ల ను వెంటనే పునరుద్ధరించాలని,కాలనీలలో అన్ని రకాల మౌలిక వసతుల కల్పనకు కృషి చేయాలని, రోడ్ల మరమ్మత్తులు చేపట్టాలని, పారిశుధ్య నిర్వహణ పై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని, కాలనీలలో పేరుకుపోయిన చెత్త చెదరాం, మట్టి కుప్పలను వెంటనే తొలగించేలా సంబంధిత అధికారులకు ఆదేశాలు ఇవ్వాలని ఎమ్మెల్యే గాంధీ జోనల్ కమిషనర్ ఉపేందర్ రెడ్డి దృష్టికి తెచ్చారు. పై అంశాల పై జోనల్ కమిషనర్ ఉపేందర్ రెడ్డి సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో రఘునాథ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## గచ్చిబౌలిలో అభివృద్ధి పనులు పరిశీలిస్తున్న కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి



నమస్తే హైదరాబాద్, శేరిలింగంపల్లి న్యూస్ : గచ్చిబౌలి డివిజన్ పరిధిలోనీ గోపనపల్లిలో రూ. 50 లక్షలతో నూతనంగా చేపడుతున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను శుక్రవారం డిఈ విశాలాక్షి, కాలనీ వాసులతో కలిసి కార్పొరేటర్ వి.గంగాధర్ రెడ్డి కాలనీలో ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా పనులు త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి ఆదేశించారు. గచ్చిబౌలి డివిజన్ లో ప్రణాళిక బద్ధంగా అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. అదేవిధంగా భవిష్యత్తులో కూడా మరిన్ని పనులు చేపట్టి కాలనీలలో మౌనిక వసతులు కల్పించి ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతామన్నారు. నాణ్యతా విషయంలో ఎక్కడా కూడా రాజీ పడకుండా నిర్ణీత సమయంలో సీసీ రోడ్డు పనులను పూర్తి చేయాలని కార్పొరేటర్ అధికారులకు ఆదేశించారు. అనంతరం డివిజన్ కార్పొరేటర్ గోపనపల్లి వాసులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో వర్క్ ఇన్స్పెక్టర్ లక్ష్మణ్, సీనియర్ నాయకులు రాజు నాయక్, శేఖర్, రంగస్వామి, మురుగ, పల్లపు చంద్రమౌళి, నరసింహ ,చిన్న, విక్రమ్ స్థానిక నేతలు ,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

## అభివృద్ధి పనులు నాణ్యత ప్రమాణాలతో చేపట్టాలి.. కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్



నమస్తే హైదరాబాద్, శేరిలింగంపల్లి న్యూస్ : మియాపూర్ డివిజన్ పరిధిలోని జయప్రకాష్ నారాయణ నగర్ కాలనీలో నూతనంగా చేపడుతున్న సీసీ రోడ్డు పనులను జిహెచ్ఎంసి అధికారులు, స్థానిక నాయకులు కాలనీ వాసులతో కలసి కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ పరిశీలించారు. ఈ సంధర్భంగా వారు మాట్లాడుతూ కాలనీలో మౌళికవసతులు కల్పించడమే ప్రధాన ధ్యేయంగా ముందుకు సాగుతున్నామని సీసీ రోడ్ల వంటి అభివృద్ధి పనులను నాణ్యత ప్రమాణాలతో చేపట్టాలని, కాలనీ ప్రజలకు అందుబాటులో ఉంటూ రోడ్లు డ్రైనేజి, మంచినీటి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని, ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ సహకారంతో డివిజన్ పరిధిలో మంజూరైన అభివృధి పనులను పూర్తి చేసి ప్రజలకు విడతల వారిగా అందుబాటులోకి తీసుకువచ్చేల కృషి చేస్తామని కార్పొరేటర్ శ్రీకాంత్ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిహెచ్ఎంసి ఏ,ఈ పవన్ కుమార్, వర్క్ ఇన్స్పెక్టర్ నవీన్ స్థానిక నాయకులు మహేశ్వర్ రెడ్డి, జితేందర్, కాలనీ వాసులు రామాంజనేయరెడ్డి, రాఘవరావు, అశోక్ సంపత్ రెడ్డి, మాణిక్ రెడ్డి వేంకటేశ్వర శర్మ , బస్వేశ్వరావు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## నీర్మాల అంగన్వాడి కేంద్రంలో ఆకుపచ్చ రంగు దుస్తులతో విద్యార్థులు



దేవరుప్పుల ( నమస్తే హైదరాబాద్) దేవరుప్పుల మండలం నిర్మల గ్రామంలోని అంగన్వాడి కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన గ్రీన్ డే సెలబ్రేషన్ అంగన్వాడి లో పిల్లలందరూ గ్రీన్ డ్రెస్ లో ఆకుపచ్చ జీవితం స్వ భావం మరియు శక్తి యొక్క రంగు ఇది వృద్ధి మరియు శ్రేయస్సుతో ముడిపడి ఉంది. విద్యార్థులు ఘనంగా గ్రీన్ డే నీ జరుపుకున్నారు. పిల్లలందరూ అన్ని రకాల ఆకుపచ్చ రంగులను తెలివిగా ధరించారు. ఆకుపచ్చ రంగుల సాధారణంగా కనిపించే వస్తువుల ప్రదర్శనలు చూపించబడ్డాయి . మరియు రంగులు మన ప్రపంచాన్ని ఎలా మంచి ప్రదేశంగా మారుస్తుందో దాన్ని ప్రాముఖ్యతను విద్యార్థులు అర్థం చేసుకున్నారు . గ్రీన్ కలర్ ఫ్రూట్స్ స్నాక్స్ కోసం పప్పులు తీసుకొని ఆకుపచ్చ రంగు జంతువులు పక్షులు కీటికాలు మరియు పండ్లు కూరగాయలు రంగుల చిత్రాలతో తరగతి గదిని అలంకరించారు . చిన్నపిల్లలు సూపర్వైజర్ శ్రీదేవి మరియు సెక్రటరీ భాగ్యరాజ్ వారికి స్వాగతం పలికారు ఈ కార్యక్రమంలోని, ప్రాథమిక పాఠశాల హెచ్ఎం , ఏఎన్ఎం కవిత , అంగన్వాడీ టీచర్లు ఉమా, ఆయా రేణుక, తల్లిదండ్రులు, తదితరులు, పాల్గొన్నారు,

## కొండా లక్ష్మణ్ బాపూజీ గారి ఆశయ సాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలి.

బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు తాటికొండ సీతయ్య



నమస్తే హైదరాబాద్ తుంగతుర్తి ప్రతినిధి సెప్టెంబర్ 27: ఉవ్వెత్తిన ఎగిసిన 1969 తెలంగాణ ఉద్యమంలో తన మంత్రి పదవికి రాజీనామా చేసి ఎందరో తెలంగాణ ఉద్యమకారులకు స్ఫూర్తిగా నిలిచిన మహానేత కొండా లక్ష్మణ్ బాపూజీ గారు వారి యొక్క ఆశయ సాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని తుంగతుర్తి బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు తాటికొండ సీతయ్య అన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధనకు సాగిన సుధీర్ఘ ఉద్యమానికి కొండా లక్ష్మణ్ బాపూజీ ఎన్నో సేవలందించారు స్వాతంత్ర పోరాటం నుండి మొదలుకొని మలిదశ తెలంగాణ ఉద్యమం వరకు ప్రజా ఉద్యమంలో కొండా లక్ష్మణ్ బాపూజీ నిర్వహించిన పాత్ర అనిర్వచనీయం.. ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ గారి జయంతి సందర్భంగా వారికి ఇదే మా ఘన నివాళులు.. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ మండల నాయకులు తునికి సాయిలు, గోపగాని వెంకన్న, కొండగడుపుల వెంకటేష్, తడకమళ్ళ మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

## హైడ్రాకు ఆక్రమణదారులు, బడా బాబులు భయపడాలి సామాన్య ప్రజలు కాదు

- ప్రజలు భయాందోళనకు గురి కావొద్దు
- ప్రజా ప్రభుత్వం ప్రజల ఇబ్బందులను తొలగిస్తుంది కొత్త ఇబ్బందులు తీసుకురాదు
- హైడ్రా పట్ల ఎలాంటి భయాందోళనలు అవసరం లేదు ప్రజలు ధైర్యంగా ఉండాలి
- జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చెవిటి వెంకన్న యాదవ్



నమస్తే హైదరాబాద్ తుంగతుర్తి ప్రతినిధి సెప్టెంబర్ 27: తెలంగాణలో ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా ప్రభుత్వమని ప్రజల ఇబ్బందులు తొలగిస్తుంది తప్ప కొత్త ఇబ్బందులు తీసుకురాదని హైడ్రా పట్ల ప్రజలు ధైర్యంగా ఉండాలని వదంతులు నమ్మవద్దని జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చెవిటి వెంకన్న యాదవ్ ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎఫ్టిఎల్, బఫర్ జోన్లలో ఉన్న భూములను కాపాడి చెరువు విస్తీర్ణాన్ని పెంచేందుకు తీసుకువచ్చిన హైడ్రా బడా బాబులు, అక్రమార్కుల గుండెల్లో రైళ్లు పరిగెత్తిస్తుందన్నారు. హైదరాబాద్ తో పాటు ఇతర ప్రాంతాల్లో కూల్చి వేసిన భవనాలు అక్రమ కట్టడాలు అన్ని ఎఫ్టిఎల్, బఫర్ జోన్ల పరిధిలో ఉన్నవే అన్నారు. చెరువు భూములను ఆక్రమించుకొని నివాసాలు ఏర్పాటు చేసుకున్న అక్రమార్కులు భయపడాలి తప్ప సామాన్య ప్రజలకు హైడ్రా ఏలాంటి హాని తలపెట్టదన్నారు. కొందరు అక్రమార్కులు ప్రజలతో చేరి లేని పోనివి చెప్పి వారిని ఆందోళనకు గురి చేస్తున్నారని ప్రజలు వదంతులు నమ్మవద్దన్నారు. పేద మధ్యతరగతి ప్రజలు అప్పులు చేసి బ్యాంకు రుణాలు తీసుకొని ప్లాట్లు కొనుగోలు చేసి కట్టుకున్న విషయం ప్రభుత్వానికి తెలుసని ప్రభుత్వం వారిని రోడ్డున పడేసే ప్రయత్నం ఎట్టి పరిస్థితుల్లో చేయదని అన్నారు.

## ఫోటో వీడియో గ్రాఫర్స్ ఎన్నికలు



కాజీపేట సెప్టెంబర్ 27 (నమస్తే హైదరాబాద్) తెలంగాణ రాష్ట్ర ఫోటో వీడియో గ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సార్వాత్రిక ఎన్నికలు మొదటి విడత గా కాజిపేట్ స్థానిక రైల్వే కమ్యూనిటీ హాల్ లో జరిగిన ఎన్నికలలో ఉమ్మడి వరంగల్, ఉమ్మడి ఖమ్మం, ఉమ్మడి కరీంనగర్, ఉమ్మడి ఆదిలాబాద్, సిద్దిపేట, యాదాద్రి జిల్లా లనుండి 1100 మంది ఫోటో గ్రాఫర్లు ఓటు వేచారు. ఎన్నికల కమిషన్ గా జి కె రూపాస్, సంపత్ కుమార్, శ్రీనివాస్ రావు వ్యవరించారు. ఈ కార్యక్రమం లో వ్యవస్థాపక అధ్యక్షులు వెంకట్ రెడ్డి , వరంగల్ జిల్లా అధ్యక్షులు జి. లింగమూర్తి, స్థానిక అధ్యక్షులు టి జెగదిశ్వర్ మరియు కార్యవర్గం పాల్గొన్నారు.

## ఆర్ పి ఎఫ్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు..



కాజీపేట సెప్టెంబర్ 27 ( నమస్తే హైదరాబాద్) రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ ఆవిర్భావ దినోత్సవాల వేడుకల దృష్ట్యా వారం రోజుల పాటు జరిగే కార్యక్రమాలలో భాగంగా 27.09.2024న కాజీపేట ఆర్ పి ఎఫ్ ఆఫీస్ కాజీపేటలో లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్, హనుమకొండ, ధీర %ఽ% రెడ్ల సమన్వయంతో రక్తదాన శిబిరాన్ని నిర్వహించింది. క్రాస్ బ్లడ్ బ్యాంక్, హనుమకొండ. ఈ రక్తదాన శిబిరంలో కాజీపేట రైల్వే స్టేషన్లో పనిచేస్తున్న ఆర్పిఎఫ్ సిబ్బంది మరియు ఇతర విభాగాల సిబ్బంది అంటే కమర్షియల్, టెలికాం, ఇంజినీరింగ్, పివే, ఎలక్ట్రికల్, తదితర విభాగాల సిబ్బంది మరియు స్థానిక పోలీసులు, కాజీపేట, టాస్క్ ఫోర్స్ హనుమకొండ సిబ్బంది కూడా పాల్గొన్నారు. మొత్తం 52 మంది సభ్యులు పాల్గొని రక్తదానం చేశారు. రైజింగ్ డే వేడుకల సందర్భంగా రక్తదానంలో పాల్గొన్న ప్రతి దాతలకి కృతజ్ఞతలు తెలిపారు

## ఘనంగా కొండా లక్ష్మణ్ బాపూజి జయంతి వేడుకలు



నాగారం నమస్తే హైదరాబాద్: (సెప్టెంబర్ 27) కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకలను శుక్రవారం నాగారం మండల పరిషత్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో ధారా శ్రీనివాస్ కొండ లక్ష్మణ్ బాబుజి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన చేసిన సేవలు కొనియాడా రు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ కే. మారయ్య, ఏపీఓ రవి సూపర్డెంట్ ముత్తయ్య, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## గౌడ సంఘం నూతన అధ్యక్షుడిగా అరెల్లి ట చిన్నఊరమేష్



ధర్మసాగర్ సెప్టెంబర్ 27 (నమస్తే హైదరాబాద్ ) హనుమకొండ జిల్లా. ధర్మసాగర్ మండలం దేవునూరు గ్రామంలో గౌడ సంఘం నూతన అధ్యక్షుని ఎన్నుకోవడం జరిగింది అధ్యక్షునిగా అరెల్లి చిన్న రమేష్ అలియాస్ వాజ్పేయి ఉపాధ్యక్షునిగా చింతమధు కోశాధికారిగా తాళ్ల పల్లి రాంబాబు కార్యదర్శి బైరి సురేష్ అనంతరం అధ్యక్షుడు అరెల్లి రమేష్ మాట్లాడుతూ సంఘ సభ్యులతో మాట్లాడుతూ నాపై ఉన్న నమ్మకాన్ని వమ్ము చేయనని గౌడ సంఘ అభివృద్ధి కోసం నిరంతరం శ్రమిస్తానని అన్నారు ఈ కార్యక్రమంలో కమిటీ మెంబర్లు ఆరేల్లి రమేష్ బైరి శ్రీనివాస్ కాసగోని మొగిలి అరె లి చిరంజీవి చింత కుమారస్వామి కుల పెద్దలు యువకులు ఈ కార్యక్రమాలు పాల్గొన్నారు

# బోడుప్పల్ కార్పొరేషన్ లో సాధారణ సర్వ సభ్య సమావేశం.

## 30 కోట్ల 55 లక్షల పనులకు ఏకగ్రీవ తీర్మానం..




బోడుప్పల్ (నమస్తే హైదరాబాద్) : బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ లో సాధారణ సర్వసభ్య సమావేశం నగర మేయర్ తోటకూర అజయ్ యాదవ్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో 30 కోట్ల 55 లక్షల అభివృద్ధి పనులకు ఏకగ్రీవ తీర్మానం చేశారు. ఈ కార్యక్రమానికి కార్పొరేటర్లు,కో ఆప్షన్స్ సభ్యులు,అధికారులు పాల్గొన్నారు.

# స్వచ్ఛతాహి సేవ కార్యక్రమంలో భాగంగా బైక్ ర్యాలీలో పాల్గొన్న కొండల్ రెడ్డి




పోచారం సెప్టెంబర్ 27 (నమస్తే హైదరాబాద్) మేడ్చల్ జిల్లా, పోచారం మున్సిపల్ పరిధిలోని జోడిమెట్ల చౌరస్తా నుండి వయా అన్నోజిగూడ నారాపల్లి నందనం వరకు స్వచ్ఛతాహి సేవ కార్యక్రమంలో భాగంగా బైక్ ర్యాలీలో పాల్గొన్న పోచారం మున్సిపల్ చైర్మన్ బోయపల్లి కొండల్ రెడ్డి.కొండల్ రెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్కరు పరిసరాల పరిశుభ్రత పాటించాలని, మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ రెడ్డియా నాయక్,కౌన్సిలర్ సుర్వీ రవీందర్ గౌడ్, కో ఆప్షన్ సభ్యులు అక్రమ్ అలి,పోచారం మాజి ఉప సర్పంచ్ ఆకిటి బల్ రెడ్డి, శానిటరీ ఇన్స్పెక్టర్ వాణి,మున్సిపల్ సిబ్బంది తదితరులు పెద్దా సంఖ్యలో పాల్గొన్నారు.

# స్వచ్ఛత హి సేవ కార్యక్రమంలో భాగంగా మాస్ క్లీనింగ్ డ్రైవ్ నిర్వహించిన పావని జంగయ్య




ఘట్కేసర్ సెప్టెంబర్ 27 (నమస్తే హైదరాబాద్) మేడ్చల్ జిల్లా, ఘట్కేసర్ మున్సిపల్ చైర్ పర్సన్ శ్రీమతి ముల్లి పావని జంగయ్య యాదవ్ ఆధ్వర్యంలో స్వచ్ఛతాహి సేవ 2024 కార్యక్రమం చేయడం జరిగింది. కార్యక్రమంలో భాగంగా ఔటర్ రింగ్ రోడ్డుపై ఉన్న ఘట్కేసర్ బస్ స్టాండ్ ప్రాంగణం లో మాస్ క్లీనింగ్ డ్రైవ్ నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో కమిషనర్ శ్రీ యం డి సాబేర్ అలీ, వైస్ చైర్మన్ పి మాధవ రెడ్డి, 1వ వార్డ్ కౌన్సిలర్ వెంకట్ రెడ్డి ,4వ వార్డ్ కౌన్సిలర్ బి ఆంజనేయులు, 5వ వార్డ్ కౌన్సిలర్ శ్రీమతి కే అనురాధ, మాజీ ఎంపీటీసీ గోపాల్ రెడ్డి మరియు మున్సిపల్ స్టాఫ్ పాల్గొన్నారు.

# రేషన్ కార్డు లేకున్నా ఇందిరమ్మ ఇల్లు



నమస్తే హైదరాబాద్ : రేషన్ కార్డు లేకున్నా నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తా మని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వెల్లడించారు. ఈ మేరకు కొత్తగా ఏర్పాటు చేయనున్న ఇందిరమ్మ కమిటీలు అలాంటి అర్హులను గుర్తిస్తాయని తెలిపారు. దసరా నాటికి ఆ కమిటీలను అందుబాటు లోకి తీసుకొస్తామని అన్నారు. గ్రామస్థాయి కమిటీలో సర్పంచ్/పర్సన్ ఇన్ చార్జి, గ్రామ కార్యదర్శి, ముగ్గురు సేవా కార్యకర్తలు ఉంటారని తెలిపారు. అవసరమైతే ఇండ్ల సంఖ్య పెంచుతామని మంత్రి స్పష్టం చేశారు.

# ఎంబీబీఎస్ విద్యార్థిని చదువుకి బాసటగా నిలిచిన ఉప్పల్ ఎమ్మెల్యే

## మేడ్చల్ మల్కాజ్ గిరి జిల్లా కలెక్టర్ గౌతమ్ పొట్రూ చేతుల మీదుగా అందజేత

ఉప్పల్ (నమస్తే హైదరాబాద్) :ఎంబీబీఎస్ విద్యార్థులకు అండగా నిలుస్తున్న ఉప్పల్ ఎమ్మెల్యే నీ జిల్లా కలెక్టర్, ఎంపీ ఈటల రాజేందర్ అభినందించారుచిలుక నగర్ డివిజన్ కి చెందిన సత్యనారాయణ కుమార్తె బిట్ట కీర్తన కామినేని అకాడమీ మెడికల్ సైన్సెస్ అండ్ రీసెర్చ్ సెంటర్ ఎల్ బి నగర్ లో ఎంబీబీఎస్ 2 వ సంవత్సరం చదువుతుంది. ఫీజు కట్టలేక ఇబ్బంది పడుతున్న విషయం తెలుసుకున్న ఉప్పల్ ఎంఎల్ఏ బండారు లక్ష్మారెడ్డి తన స్వంత నిధులతో బి ఎల్ ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ఎంబీబీఎస్ కి అయ్యే ఫీజు 60,000/- రూపాయల చెక్కును జిల్లా కలెక్టర్ కార్యాలయం లో అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ ఉప్పల్ నియోజకవర్గ పరిధిలోని ఎవరైనా ఎంబీబీఎస్ సీటు సాధిస్తే ఫీజు మొత్తం తానే చెల్లిస్తామని



ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో బి ఆర్ ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

# లీగల్ సెల్,ఆర్ టీ ఐ,హ్యూమన్ రైట్స్, మేడ్చల్ వైస్ చైర్మన్ గా రవి బాలెంల



పిర్జాదిగూడ సెప్టెంబర్ 27 (నమస్తే హైదరాబాద్) మేడ్చల్ జిల్లా, ఫిర్జాదిగూడ, లీగల్ సెల్, ఆర్ టీ ఐ, హ్యూమన్ రైట్స్ కాంగ్రెస్ పార్టీ మేడ్చల్ జిల్లా వైస్ చైర్మన్ గా ఎన్నికైన శ్రీధర్ రెడ్డి అలియాస్ రవి బాలెంల ఎంపిక అయ్యినదుకు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కాలనీవాసులు, శ్రీధర్ కి శుభాకాంక్షలు తెలిపారు. శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ నాకు ఈ అవకాశం ఇచ్చిన శ్రీమతి సోనియా గాంధీ కి, ఏ ఐ సి సి ప్రెసిడెంట్ మల్లికార్జున్ ఖర్గే కి, ఎక్స్ ప్రెసిడెంట్ రాహుల్ గాంధీ కి, తెలంగాణ స్టేట్ ఏఐసీసీ ప్రెసిడెంట్ రేవంత్ రెడ్డి(సిఎం) కి, టి పి సి సి, పొన్నం అశోక్ గౌడ్ టి పి సి సి లీగల్ సెల్ చైర్మన్ కి, మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ వజ్రేష్ యాదవ్ కి, మాజీ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి కి, వంగేటి ప్రభాకర్ రెడ్డి కి (చైర్మన్, లీగల్ సెల్, ఆర్టిఐ, హ్యూమన్ రైట్స్), పిర్జాదిగూడ మేయర్ అమర్ సింగ్ కి, దర్గా దయాకర్ కి, పిర్జడిగూడ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తుంగతుర్తి రవి కి, నన్ను వైస్ చైర్మన్ గా ఏపింక చేసినందుకు ప్రతి ఒక్కరికి పేరుపేరునా ధన్యవాదాలు తెలుపుతున్నాను. ఈ కార్యక్రమంలో 8 డివిజన్ కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఐలేష్ యాదవ్( కాంగ్రెస్ పార్టీ ఒబిసి సెల్ చైర్మన్, మేడిపల్లి మండలం), నాగరాజ్, శ్రీనివాస్ కె, ఎస్ మహేష్, శ్రీనివాస్, కిష్టారెడ్డి కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు అనంతరెడ్డి, ప్రభాకర్ రెడ్డి, జయపాల్ రెడ్డి, అరుణ్ కుమార్, గంగా రెడ్డి, వంశీ, తదితరులు శుభాకాంక్షలు తెలిపారు.

# ఎస్.జి.ఎఫ్ దేవరుప్పుల మండల స్థాయి క్రీడోత్సవాలు

## ఎంపికైన విద్యార్థులకు అభినందనలు తెలిపిన కరస్పాండెంట్ తోటకూరి పాండు కృష్ణ

దేవరుప్పుల (నమస్తే హైదరాబాద్) 68 వ దేవరుప్పుల మండల స్థాయి ఎస్.జి.ఎఫ్ క్రీడోత్సవాలు శుక్రవారం రోజున మండలంలోని చిన్నమడూర్ యుపిఎస్ జెడ్పిహెచ్ఎస్ సంబంధించిన పాఠశాలలోని అండర్ 14 - 17 సంవత్సరాలలోపు బాల బాలికలకు సంబంధించిన క్రీడోత్సవాలను ప్రారంభించిన డిఈవో రాము, ఎంఈవో కళావతి. ఈ క్రీడోత్సవాలలో కబడ్డీ కోకో వాలీబాల్ పోటీలు





నిర్వహించడం జరిగిందని తెలిపారు. ఇట్టి క్రీడలలో సెలెక్ట్ కాబడిన క్రీడాకారులు జోనల్ స్థాయి క్రీడలలో పాల్గొంటారని వారు తెలిపారు. జూనియర్స్, సీనియర్స్ విభాగాల్లో మండల కేంద్రంలోని శ్రీ సాయి ప్రశాంతి విద్యానికేతన్ పాఠశాల విద్యార్థులు 17 మంది ఎంపికైనారని పాఠశాల కరస్పాండెంట్ తోటకూరి పాండు కృష్ణ తెలియజేసి వారికి ప్రత్యేక అభినందనలు తెలిపారు. విద్యార్థులకు అభినందనలు తెలిపిన వారిలో. పాఠశాల ప్రిన్సిపాల్ తోటకూరి స్వప్న. పిఈటి రవి కుమార్ .ఖలీల్ పాషా. మహేష్. ఉపాధ్యాయ .బృందం. తదితరులు .ఉన్నారు.

# ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

- 6 గ్యారంటీల అమలే ప్రభుత్వ లక్ష్యం
- మల్కాజ్ గిరి పార్లమెంట్ ఇంచార్జ్ పట్నం సునీత మహేందర్ రెడ్డి,
- కూకట్పల్లి ఇంచార్జి బండి రమేష్..



కూకట్పల్లి (నమస్తే హైదరాబాద్): కాంగ్రెస్ పార్టీలో కష్టపడి పనిచేసిన వారికి పార్టీ తగిన గుర్తింపు ఇస్తుందని మల్కాజ్గిరి పార్లమెంట్ ఇంచార్జ్ పట్నం సునీత మహేందర్ రెడ్డి అన్నారు. కూకట్పల్లి నియోజకవర్గానికి చెందిన మార్కెట్ కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్ డైరెక్టర్లు శుక్రవారం పదవి ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా పలు పదవులు లభించిన వారికి పట్నం సునీత మహేందర్ రెడ్డి అభినందించారు. అనంతరం పట్నం సునీత మహేందర్ రెడ్డి మాట్లాడుతూ ఏ పార్టీ కైనా కార్యకర్తలే ప్రధానమని పార్టీ అభివృద్ధి కోసం కష్టపడి పని చేసిన వారికి కాంగ్రెస్ పార్టీలో తగిన గుర్తింపు ఉంటుందని ఈ సందర్భంగా తెలిపారు. పదవులు వచ్చిన వారు ఎంత ఎదిగిన ఒదిగి ఉండే నేపథ్యాన్ని అలవర్చుకొని ముందుకు సాగాలని తద్వారా వారి అభివృద్ధికి దోహదపడుతుందన్నారు. పదవులు రాని వారు సైతం నిరాశకు గురి కావద్దని త్వరలోనే అర్హులైన నేతలకు పదవులు ఇప్పించడానికి తాను కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు పదవుల పొందిన వారికి అవకాశం ఉ ంటుందని రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న ప్రజా సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కృషి చేయాలని సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు రుణమాఫీ చేసిందని ఆ విషయాన్ని మార్కెట్ కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్, డైరెక్టర్లు క్రింది స్థాయి ప్రజలకు తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు. ఎన్నికలకు ముందు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారంటీల్లో భాగంగా ఇప్పటికే మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, 500 రూపాయలకే అర్హులైన వారికి సబ్సిడీపై గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల లోపు ఉచితంగా కరెంటు ఇవ్వడం జరుగుతుందన్నారు. 5 లక్షల రాజీవ్ ఆరోగ్యశ్రీని 10 లక్షల రూపాయలకు పెంచడం జరిగిందన్నారు. త్వరలోనే మిగిలిన హామీలు సైతం ప్రభుత్వం పూర్తి చేయగలదని తెలిపారు ప్రతి ఒక్కరూ పార్టీ పటిష్టత కోసం కృషిచేసి ప్రజలకు సేవలందించాలని సూచించారు. కార్యక్రమంలో కూకట్ పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు శేరి సతీష్ రెడ్డి.

Printed published and owned by Godishala Somaiah published from # 15-76,Medipally, Ghatkesar,Ranga reddy,Dist,Printed at Sri SehaSai Printers,IDA BalaNagar, Hyderabad,Editor : Godishala Somaiah,email:nhnews24@gmail.com,ph 9912580066,RNI APTEL/2012/45237..